సాక్షి ఖమ్మం
ఆదివారం । 28 । జూలై । 2024



ముస్తాబైన ఆడిటోరియం!

నేలకొండపల్లిలో రామదాసు ఆడిటోరియం సిద్ధమవుతుండగా.. రామాయణం, రామదాసు జీవిత ఘట్టాల చిత్రాలు వేయిస్తున్నారు. 10లో



సహకారంతో సమాజాభివృద్ధి

పూర్వకాలం నుంచి పరస్పర సహకారంతోనే సమాజం అభివృద్ధి చెందుతోందని ఏపీ హైకోర్టు జడ్జి డాక్టర్ కృపాసాగర్ వెల్లడించారు. 10లో

గరిష్టం / కనిష్టం
31° / 25°

వాతావరణం

జిల్లా అంతటా ఆదివారం వర్షసూచనలు ఉన్నాయి. చిరుజల్లులు మొదలు ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

శ్రీవారికి ప్రత్యేక పూజలు



మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయంలో మూల విరాట్‌తో పాటు స్వామి వారి పాదానికి అర్చకులు పంచామృతాలతో అభిషేకం చేశారు. అతర్వాత స్వామి, అమ్మవార్లను పట్టువస్త్రాలతో అలంకరించి నిత్యకల్యాణం, పల్లకీసేవ నిర్వహించారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్‌తో పాటు తెలంగాణ, ఏపీ రాష్ట్రాల భక్తులు పెద్దసంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ జగన్మోహన్‌రావు, చైర్మన్ శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, సూపరింటెండెంట్ విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లాలో మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 10గంటలకు కూసుమంచి మండలం పాలేరులో డ్రెయినేజీలు, జుజ్జులరావుపేట, తురకగూడెం నుండి కిష్టాపురం వరకు, తురకగూడెం నుండి చింతలతండా గ్రామాల వరకు సీసీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తారు. ఆతర్వాత కూసుమంచిలోని క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తారు. అనంతరం ఖమ్మంలో జరిగే మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు రాయల చంద్రశేఖర్ సంస్మరణ సభకు హాజరుకానున్న మంత్రి, ఆతర్వాత ఇంకొన్ని కార్యక్రమాల్లో పాల్గొంటారు.

కేసుల విచారణలో సాంకేతిక పరిజ్ఞానం



మాట్లాడుతున్న జిల్లా జడ్జి రాజగోపాల్

ఖమ్మం లీగల్: న్యాయస్థానాల్లో కేసుల విచారణ సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్ వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ సూచించారు. పోలీసు, ఎక్సైజ్, జైలు అధికారులతో పాటు న్యాయమూర్తులతో శనివారం జిల్లా జడ్జి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన నాన్ బెయిలబుల్ వారెంట్ల అమలుపై పోలీసు అధికారులకు సూచనలు చేశారు. వారెంట్లను సకాలంలో అమలు చేసి కేసుల సత్వర విచారణకు సహకరించాలని తెలిపారు. అలాగే, జైళ్లలో ఉన్న విచారణ ముద్దాయిల విషయంలో చార్జిషీట్లు దాఖలు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో న్యాయమూర్తులు కె.ఉమాదేవి, కె.దీప, బి.రజిని, వై.బిందుప్రియతో పాటు పోలీసు, ఎక్సైజ్, జైలు అధికారులు పాల్గొన్నారు.

ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంమయూరిసెంటర్: ఎస్సీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బెస్ట్ అవైలబుల్ స్కూళ్ల పథకంలో ఏర్పడిన 33 ఖాళీ సీట్ల భర్తీకి అర్హులైన ఎస్సీ విద్యార్థుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎస్సీ డీడీ కస్తాల సత్యనారాయణ తెలిపారు. నాన్ రెసిడెన్షియల్ విభాగం 3వ తరగతిలో రెండు, 4వ తరగతిలో ఒకటి, 5, 6వ తరగతుల్లో మూడు చొప్పున, 7వ తరగతిలో రెండు, 8వ తరగతిలో నాలుగు, 9వ తరగతిలో ఐదు సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఇక రెసిడెన్షియల్ విభాగంలో 7వ తరగతిలో మూడు, 8వ తరగతిలో తొమ్మిది, 9వ తరగతిలో ఒక సీటు ఖాళీగా ఉందని తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన విద్యార్థులు కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలతో పాటు గత విద్యా సంవత్సరం బోనఫైడ్ సర్టిఫికెట్, ప్రోగ్రెస్ కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో ఈనెల 31న కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని డీడీ సూచించారు.

'బీమా'లో పేర్ల నమోదు

ఖమ్మంవ్యవసాయం: అర్హత కలిగిన రైతులు ఆగస్టు 5లోగా రైతుబీమాలో నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎం.విజయనిర్మల సూచించారు. ఈ ఏడాది జూన్ 28లోపు ధరణి పోర్టల్ ద్వారా నూతన పట్టాదారు పాస్‌బుక్, ఆర్వోఎఫ్‌ఆర్ పొందిన వారే కాక పాత పట్టాదారు పాస్ పుస్తకాలు కలిగిన 15,075 మంది రైతులు బీమాకు అర్హులుగా ఉన్నారని పేర్కొన్నారు. ఇందులో 4,062 మందే పేర్లు నమోదు చేసుకున్నారని తెలిపారు. మిగతా వారు దరఖాస్తు ఫారం, పట్టాదారు పాస్‌పుస్తకం, ఆర్వోఎఫ్‌ఆర్, ఆధార్ జిరాక్స్‌తో ఏఈఓలను సంప్రదించాలని సూచించారు.

మనది 11వ ర్యాంక్!



తలసరి ఆదాయంలో జిల్లాకు రాష్ట్రంలో 11వ స్థానం దక్కింది. ఇది చెప్పుకోదగిన స్థానమే అయినా ఇంకా మరింత మెరుగుపడాల్సిన ఆవశ్యకతను చెప్పినట్లయింది. తాజాగా రాష్ట్ర ప్రణాళికా సంఘం 2023 –24 ఆర్థిక సంవత్సరానికి గాను సామాజిక, ఆర్థిక సర్వే నివేదికను విడుదల చేసింది. ఈ నివేదిక ఆధారంగా పలు అంశాల్లో జిల్లా మెరిట్ మార్కులు సాధించింది. ఇంకొన్ని రంగాల్లో మాత్రం అత్తెసరు మార్కులే దక్కాయి. ప్రధానంగా తలసరి ఆదాయంలో రాష్ట్రంలో 11వ స్థానంలో నిలవగా.. అడవుల అభివృద్ధికి సంబంధించి నిధుల వ్యయంలో ప్రథమ స్థానంలో నిలవడం విశేషం. – సాక్షిప్రతినిధి, ఖమ్మం

తలసరి ఆదాయంలో ఇదీ స్థానం

- అటవీ ప్రాంతాలకు నిధుల వ్యయంలో రాష్ట్రంలోనే టాప్
- రోడ్డు వసతి.. ఉపాధి కల్పనలోనూ మెరుగు
- పర్యాటక రంగంలో నేలకొండపల్లి బౌద్ధస్థూపం భేష్
- సామాజిక, ఆర్థిక సర్వే నివేదికలో వెల్లడి

మెరుగైన స్థానమే

జిల్లా తలసరి ఆదాయం రూ.2,44,647గా నివేదికలో పొందుపరిచారు. తద్వారా రాష్ట్రస్థాయిలో11వ స్థానం దక్కగా.. హైదరాబాద్ చుట్టుపక్కల జిల్లాల తర్వాత స్థానంలో జిల్లా నిలవడం విశేషం. ఒక కుటుంబ ఆర్థిక, జీవన స్థితిగతులను తెలిపే తలసరి ఆదాయం మెరుగ్గానే ఉన్నట్లు సర్వే గణాంకాల్లో స్పష్టమైంది. ఇక జిల్లాలో రైతుల వద్ద సగటున 0.91 హెక్టార్ల భూమి మాత్రమే ఉంది. ఈ లెక్కల్లో జిల్లా రాష్ట్రంలో 15వ స్థానంలో నిలిచింది. వ్యవసాయాధారితమైన జిల్లాలో భూమి లభ్యత కొంత మేర తక్కువగా ఉండడం గమనార్హం. అయితే, ఏజెన్సీ ప్రాంతం కావడం, అటవీ విస్తీర్ణం ఎక్కువగా ఉండడంతో వ్యవసాయ భూమి ఇతర జిల్లాలతో పోలిస్తే తక్కువగా ఉన్నట్లు చెబుతున్నారు.

అడవుల పెంపకంలో ముందంజ

అడవుల పెంపకం కోసం 2014–15 ఏడాది నుంచి 2023–24 ఏడాది వరకు నిధుల వ్యయంతో రాష్ట్రంలోనే జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. ఈ పదేళ్లల్లో దాదాపు 84.89 శాతం నిధులను అడవుల పెంపకానికి వెచ్చించారు. తెలంగాణ, ఏపీలో పరిశీలిస్తే ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే అడవులు ఎక్కువగా ఉన్నాయి. రాష్ట్ర, జిల్లాల విభజన తర్వాత కూడా జిల్లాలో అటవీ విస్తీర్ణం ఏ మాత్రం తగ్గలేదు. దీంతో అటవీ శాఖ హరితహారం పేరుతో మొక్కల పెంపకానికి ప్రాధాన్యతనిచ్చింది. అలాగే, అక్రమంగా పోడు చేసుకుంటున్న వారి నుంచి భూములు స్వాధీనం చేసుకొని సామాజిక అడవుల పెంపకం చేపట్టేందుకు భారీగా నిధులు ఖర్చు చేశారు.

అంత కంటే ఎక్కువ

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జిల్లాలో లక్ష్యానికి మించి పనిదినాలు కల్పించారు. జిల్లాకు 46.4 లక్షల పనిదినాలను లక్ష్యంగా కేటాయిస్తే ఇప్పటికే 54.8 లక్షల పనిదినాలను పూర్తి చేశారు. అంటే 118 శాతం పనిదినాలను కల్పించినట్లయింది. తద్వారా రాష్ట్రంలో జిల్లా 12వ స్థానంలో నిలిచింది. అయితే మిగతా 11 జిల్లాలకు కేటాయించిన లక్ష్యాలతో పోలిస్తే ఖమ్మంకు ఎక్కువ లక్ష్యాన్నే కేటాయించినా అంతకు మించి పనిదినాలను పూర్తి చేయడం గమనార్హం.

మరికొన్ని అంశాల్లో ఇలా...

- జిల్లాలో గృహ, వ్యవసాయ, పరిశ్రమలకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడంలో విద్యుత్‌శాఖ మంచి పనితీరు కనబరుస్తున్నట్లు సామాజిక, ఆర్థిక సర్వేలో వెల్లడైంది. గృహ వినియోగానికి 71.8 శాతం, వ్యవసాయ రంగానికి 17శాతం, పరిశ్రమలకు 11.2 శాతం కనెక్షన్లు ఇచ్చారు. ఈ ప్రక్రియలో జిల్లా రాష్ట్రంలో 10వ స్థానం దక్కించుకుంది. గత పదేళ్లలో మారుమూల ప్రాంతాలకూ విద్యుత్ సౌకర్యం కల్పించగా, వ్యసాయ కనెక్షన్లు సైతం పెరిగాయి.
- రాష్ట్రంలో రహదారుల సాంద్రత సగటున 100 చదరపు కి.మీ.కు 98.8 కి.మీ.గా ఉంది. జిల్లా విషయానికొస్తే 118.5 డెన్సిటీతో రాష్ట్రంలో 8వ స్థానంలో నిలిచింది. గ్రామాల నుంచి మండలాలు, అక్కడి నుంచి నియోజకవర్గ కేంద్రాలను కలుపుతూ తారురోడ్లు వేశారు. ప్రతీ మారుమూలన ఉన్న గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించడంతో మెరుగైన స్థానమే దక్కినట్లయింది.
- ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ రాష్ట్రంలో వేగంగా వృద్ధి సాధిస్తోంది. జిల్లాలో మొక్కజొన్న, మిర్చి, ఆయిల్‌పామ్, మామిడి తదితర పంటలు ఎక్కువగా సాగవుతుండడంతో పరిశ్రమల ఏర్పాటుకు సానుకూల పరిస్థితులు ఉన్నాయి. వీటితో ప్రకృతి వైపరీత్యాల వల్ల కలిగే నష్టాలను రైతులకు తగ్గించే వీలు కలుగుతుంది. అంతేకాక ప్రకృతి వైపరీత్యాల వల్ల ఎదురయ్యే నష్టాలను రైతులకు తగ్గించినట్లవుతుంది. ఈమేరకు జిల్లాలో ఫుడ్‌పార్క్‌ను టీజీఐఐసీ సంస్థ ప్రోత్సహిస్తోంది.
- మరుగున పడిన చరిత్రను వెలికితీసి పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రయత్నాలు చేస్తోంది. ఇందులో భాగంగా నేలకొండపల్లిలో రూ.1.35 కోట్లను బౌద్ధస్థూపం, పరిసరాల అభివృద్ధికి వెచ్చిస్తున్నారు. దక్షిణ భారతదేశంలోని ప్రముఖ బౌద్ధ క్షేత్రాల్లో ఒకటిగా నేలకొండపల్లికి పేరుంది. ఇక్కడ జరిగే అభివృద్ధితో పర్యాటకుల రాక పెరిగి స్థానికులకు ఉపాధి మెరుగపడనుంది.
- జిల్లాలో 745 చౌక ధరల దుకాణాలకు గాను 4,11,315 రేషన్‌కార్డులు ఉన్నాయి. ఇందులో మూడు అన్నపూర్ణ కార్డులు, 26,829అంత్యోదయ అన్నయోజన కార్డులే కాక 3,84,483 ఆహార భద్రత కార్డులు ఉన్నట్లు సామాజిక ఆర్థిక సర్వే నివేదికలో పేర్కొన్నారు.

గోదారి ఉగ్రరూపం



భద్రాచలంలో చుట్టూ గోదావరి వరద ప్రవాహం

మూడో ప్రమాద హెచ్చరిక జారీ

- భద్రాచలం వద్ద 53.60 అడుగులకు చేరిన నీటిమట్టం
- జలదిగ్బంధంలో ఏజెన్సీ
- స్లూయిజ్‌ల వద్ద మళ్లీ మొరాయించిన మోటార్లు
- పునరావాస శిబిరాలకు ముంపుప్రాంత ప్రజలు

భద్రాచలం : భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహం ఉగ్రరూపం దాల్చింది. పది రోజులుగా పెరుగుతూ.. తగ్గుతూ వస్తున్న నీటిమట్టం శనివారం 53 అడుగులు దాటింది. దీంతో సాయంత్రం 4.16 నిమిషాలకు ఆర్డీఓ దామోదర్‌రావు మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఎగువ ప్రాంతాల నుంచి వరదనీరు పెరగడంతో ఉదయం 7 గంటలకు 50.80 అడుగుల మేర ప్రవహించిన నీటి మట్టం మధ్యాహ్నం 12 గంటలకు 51.90, సాయంత్రం 5 గంటలకు 53.20 అడుగులకు చేరింది. రాత్రి 12 గంటలకు 53.60 అడుగులకు చేరుకుంది. ఇక చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టు 25 గేట్లను తెరిచి నీటిని గోదావరిలోకి వదులుతున్నారు. నదికి వరద పెరగడంతో భద్రాచలంలోని ఏఎంసీ, అశోక్ నగర్ కొత్తకాలనీ తదితర ముంపు ప్రాంత ప్రజలను పునరావాస శిబిరాలకు తరలించారు.

స్తంభించిన రాకపోకలు..

గోదావరి వరదలతో భద్రాచలం ఏజెన్సీ జలదిగ్బంధం అయింది. పట్టణం నుంచి అన్ని వైపులకూ రాకపోకలు స్తంభించాయి. ఏపీలోని రాయనపేట వద్ద ప్రధాన రహదారిపైకి నీరు చేరడంతో కూనవరం, వీఆర్‌పురం మండలాలకు, దుమ్ముగూడెం మండలం తూరుబాక బ్రిడ్జి వద్ద రోడ్డుపైకి నీరు రావడంతో చర్ల, దుమ్ముగూడెం మండలాలకు రాకపోకలు నిలిచిపోయాయి. చర్ల మండలం బుర్రవేముల గ్రామంలో రోడ్డుపైకి వరద వచ్చింది. వరదతో వెంకటాపురం, వాజేడు మండలాల మధ్య కూడా రవాణా స్తంభించింది. అశ్వాపురం మండలం రామచంద్రాపురంలో కడియాలబుడ్డి వాగుకు వరద పోటెత్తడంతో సారపాక నుంచి నెల్లిపాక మీదుగా వెళ్లే వారికి అంతరాయం ఏర్పడింది. బట్టిగుంపు – రాంనగర్ గ్రామాల మధ్య సైతం రాకపోకలు నిలిచిపోయాయి. బూర్గంపాడు – రెడ్డిపాలెం రహదారిపైకి నీరు రావడంతో భద్రాచలం నుంచి అటు వైపు వెళ్లే వాహనాలు ఆగిపోయాయి. ఇలా మొత్తంగా భద్రాచలం నుంచి బీపీఎల్ మీదుగా వెళ్లే రహదారి మినహా అన్ని వైపులా రవాణా స్తంభించింది. ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలకు సైతం రాకపోకలు నిలిచిపోయాయి.

మోటార్ల మొరాయింపు..

కరకట్టపై స్లూయిజ్‌ల వద్ద మోటార్ల మొరాయింపు సమస్య మళ్లీ తలెత్తింది. అక్కడ ఏర్పాటు చేసిన మోటార్లు పనిచేయకపోవడం, స్లూయిజ్‌ల లీకేజీతో కాలనీలను వరద నీరు ముంచెత్తుతోంది. దీంతో కాలనీల ప్రజలు పడుతున్న వెతలపై 'సాక్షి' శనివారం సైతం కథనం ప్రచురించింది. అయినా అధికా రుల వ్యవహార శైలిలో మార్పు రాలేదు. రెడ్డిభవన్ వద్ద ఏర్పాటు చేసిన మోటార్లు సరిగా పనిచేయకపోవడంతో కొత్తకాలనీ, ఏఎంసీ కాలనీల్లో ఇళ్లలోకి వరద నీరు చేరింది. దీంతో పంచాయతీ అధికారులు ట్రాక్టర్లను ఏర్పాటు చేసి 33 కుటుంబాలను నన్నపనేని మోహన్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస శిబిరానికి తరలించారు. సాయంత్రానికి వరద పెరగడంతో ముంపు కాలనీల్లోని 106 కుటుంబాలకు చెందిన 346 మందిని పునరావాస శిబిరాలకు తరలించారు. ఇక ముంపు మండలాలకు చెందిన 52 మంది గర్భిణులకు గుర్తించి ముందస్తుగా భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో చేర్పించారు. వరద తగ్గిందంటూ కూనవరం వైపున విజయవాడ – జగదల్‌పూర్ జాతీయ రహదారిపై ఇటీవల పోసిన కరకట్టను రెండు రోజుల క్రితం తొలగించారు. అయితే గోదావరి తిరిగి ఉధృతంగా ప్రవహిస్తుండటంతో మళ్లీ తాత్కాలికంగా కట్ట పోసి ఇసుక బస్తాలు అడ్డుకట్టగా వేశారు. దీంతో సుభాష్‌నగర్ కాలనీని ప్రస్తుతానికైతే వరద చుట్టుముట్టలేదు.

లింక్ కెనాల్ పనుల్లో వేగవంతం పెరగాలి

రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



కెనాల్ పనులను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల

ఏన్కూరు: సీతారామ లింక్‌కెనాల్ పనుల్లో మరింత వేగం పెంచాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు ఆదేశించారు. ఏన్కూరు మండలం హిమామ్‌నగర్‌లో జరుగుతున్న లింక్ కెనాల్ నిర్మాణాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భూయజమానులైన రైతుల ప్రాథమికంగా పనులు పూర్తయ్యాయని, నిర్మాణం తుదిదశకు చేరుకుందని తెలిపారు. సుమారు రూ.70 కోట్ల వ్యయంతో లక్షన్నర ఎకరాలకు సాగునీరు అందించేందుకు సీతారామ ప్రాజెక్టు నిర్మస్తున్నందున ఎక్కడా పనులు ఆగకుండా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. వచ్చేనెల ముఖ్యమంత్రి జిల్లా పర్యటన నాటికి పనులు పూర్తయ్యేలా కార్యాచరణ రూపొందించుకోవాలని తెలిపారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరావు, ఎస్ఈ శ్రీనివాస్‌తో పాటు పువ్వాళ్ల దుర్గప్రసాద్, మొగిలి శ్రీనివాసరెడ్డి, మేడ ధర్మారావు, వాసిరెడ్డి నాగేశ్వరావు పాల్గొన్నారు.

విద్యుత్ కార్యాలయాల్లో సేవా కేంద్రాలు

ఖమంవ్యవసాయం: వినియోగదారుల సమస్యలు త్వరగా పరిష్కరించేలా విద్యుత్ కార్యాలయాల్లో సేవా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని ఖమ్మం ఎస్ఈ ఏ.సురేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. సర్కిల్, డివిజన్, సబ్ డివిజన్, సెక్షన్ కార్యాలయాల్లో ఇవి అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు. వినియోగదారులు తమ సమస్యలపై ఆయా కార్యాలయాల్లో ఫిర్యాదు చేసి రశీదు పొందొచ్చని తెలిపారు. ఆపై ప్రాధాన్యత క్రమంలో ఫిర్యాదులను పరిష్కరించనుండగా, ఎప్పటికప్పుడు స్థితిగతులను ట్రాక్ చేసుకునే అవకాశం కల్పిస్తామని పేర్కొన్నారు.

అంతరాయాలు లేకుండా సరఫరా

వర్షాలు కురుస్తున్నప్పటికీ ఎక్కడా అంతరాయం లేకుండావిద్యుత్ సరఫరా చేస్తుండడంతో జిల్లా ఉద్యోగులు, సిబ్బందిని ఎన్పీడీసీఎల్ సీఎండీ కె.వరుణ్‌రెడ్డి అభినందించారని ఎస్ఈ సురేందర్ ఓ ప్రకటనలో తెలిపారు. గడచిన నాలుగు నెలల్లో 1,228 వంగిన స్తంభాలు, 53 తుప్పు పట్టిన స్తంభాలను సరిచేయడమే కాక అవసరమైన చోట వైర్లు ఎస్ఈ మార్చామని వెల్లడించారు.

కలెక్టరేట్‌లో పనుల పరిశీలన



ఇంకుడుగుంత పనులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్

ఖమ్మం సహకారనగర్: కలెక్టరేట్ ఆవరణలో వాన నీటిని ఒడిసి పట్టేందుకు ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టారు. ఈ పనులతో పాటు బస్‌షెల్టర్ నిర్మాణ పనులను శనివారం అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పనుల్లో నాణ్యత పాటిస్తూ త్వరగా పూర్తిచేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో జిల్లా ఉద్యానవన అధికారి వెంకటరమణతో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ధరణి దరఖాస్తులు పరిష్కరించాలి

ఎర్రుపాలెం: పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను పరిష్కరించాలని అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆదేశించారు. ఎర్రుపాలెం తహసీల్‌ను శనివారం సందర్శించిన ఆయన తహసీల్దార్ ఎం.ఉషాశారద, ఉద్యోగులతో సమావేశమై ధరణి పెండింగ్ దరఖాస్తులపై సమీక్షించారు. దరఖాస్తుల పరిశీలన, పరిష్కారంలో వేగం పెంచాలని తెలిపారు. ఉద్యోగులు రవికుమార్, రాజశేఖర్ పాల్గొన్నారు.

మరో 75మందికి పదోన్నతి

- జిల్లాలో ఎస్‌జీటీలకు అవకాశం
- ఆప్షన్ల అనంతరం త్వరలోనే పోస్టింగ్

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని పలువురు సెకండరీ గ్రేడ్ టీచర్లకు పదోన్నతి లభించనుంది. ఇప్పటికే పదోన్నతుల ప్రక్రియ పూర్తయినప్పటికీ ఇంకో 75 ఖాళీలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో సీనియారిటీ ఆధారంగా 75మంది అర్హులను గుర్తించి విద్యాశాఖ అధికారులు జాబితా విడుదల చేశారు. ఆయా ఉపాధ్యాయులు ఒకటి, రెండు రోజుల్లో ఆప్షన్లు ఇచ్చుకోవాల్సి ఉంటుంది. ఆపై వారికి పోస్టింగ్ ఇవ్వనున్నట్లు డీఈఓ సోమశేఖర శర్మ తెలిపారు.

వేకెన్సీలు ఇలా...

ఇటీవల ఎస్‌జీటీలకు అర్హత ఆధారంగా స్కూల్ అసిస్టెంట్లుగా, పీఎస్ హెచ్‌ఎంలుగా పదోన్నతులు కల్పించారు. కొందరికి డిగ్రీ, బీఈడీ అర్హత ఉండగా.. బీఈడీలో రెండు మెథడాలజీలు చదవడంతో రెండు సబ్జెక్టుల్లోనూ పదోన్నతి అవకాశం లభించింది. ఇంకొందరికి డీఈడీ ఉంటే పీఎస్ హెచ్‌ంగానూ పదోన్నతికి అర్హత ఏర్పడింది. ఈనేపథ్యాన రెండు, మూడు వెబ్ ఆప్షన్లు ఇవ్వగా ఒక్కొక్కరికి రెండు, మూడు పదోన్నతులు లభించాయి. చివరకు ఒకటి మాత్రమే ఎంచుకోవడంతో మిగతా పోస్టులు ఖాళీ అయ్యాయి. దీంతో జాబితాలో వీరి తర్వాత పేర్లు ఉన్న 75మందిని పద్నోతులకు అర్హులుగా అధికారులు తేల్చారు.



ఇంకా సబ్జెక్ట్ టీచర్ల కొరతే...

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో సబ్జెక్ట్ టీచర్ల కొరత తీర్చడానికి అధికారులు కసరత్తు చేసినప్పటికీ పలుచోట్ల సమస్య పరిష్కారం కాలేదు. ఇప్పటికే ఎక్కువగా ఉన్న పాఠశాలల నుంచి 150మంది టీచర్లను అవసరమైన చోటకు సర్దుబాటు చేసినా ఎర్రుపాలెం మండలంలో 20మంది మేర కొరత ఉందని అధికారులు గుర్తించారు. ఆయా స్థానాలకు తాత్కాలికంగా ఎస్‌జీటీలను కేటాయించాలని భావించినా అది సాధ్యం కావడం లేదు. దీంతో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశాల మేరకు సమస్య పరిష్కారంపై దృష్టి సారించినట్లు డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు. అయితే, తాజాగా 75మంది ఎస్‌జీటీలకు పదోన్నతి లభించనున్న నేపథ్యాన సమస్య తీరే అవకాశముందని తెలుస్తోంది.

అందుబాటులో సరిపడా సామగ్రి

- ఎన్పీడీసీఎల్ సీఈ రాజుచౌహాన్



స్టోర్స్‌లో సామగ్రిని పరిశీలిస్తున్న సీఈ, అధికారులు

ఖమ్మంవ్యవసాయం: నూతన ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్ల ఏర్పాటుతోపాటు ఇతర మరమ్మతులకు కావాల్సినంత మేర సామగ్రి సిద్ధంగా ఉందని ఎన్పీడీసీఎల్ ప్రాజెక్ట్ చీఫ్ ఇంజనీర్(సీఈ) రాజుచౌహాన్ తెలిపారు. ఖమ్మంలోని విద్యుత్ స్టోర్స్‌ను శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఈ మాట్లాడుతూ వరదల దృష్ట్యా స్తంభాలు, లైన్లు, ఇన్సులేటర్ల మరమ్మతులతో పాటు కొత్త కనెక్షన్లు ఇచ్చేందుకు సరిపడా సామగ్రి సిద్ధం చేశామని తెలిపారు. కాగా, వినియోగదారులకు 24గంటల నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నామని చెప్పారు. అనంతరం తల్లంపాడు రూరల్ వ్యవసాయ ఫీడర్‌తో పాటు పలు ఫీడర్లను తనిఖీ చేసిన ఆయన విద్యుత్ అంతరాయాలు లేకుండా తీసుకోవాల్సిన చర్యలపై ఉద్యోగులకు సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో జిల్లా ఎస్ఈ ఏ.సురేందర్, అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

లక్కీ డ్రా విజేతలకు బహుమతుల పంపిణీ



బహుమతి అందజేస్తున్న ఎంవీఐ శ్రీనివాస్, పక్కన ఆర్‌ఎం సరిరామ్

ఖమ్మంమయూరిసెంటర్: ఆర్టీసీ ఖమ్మం రీజియన్ పరిధిలో ఈ నెల 1 నుంచి 15 వరకు పలు రూట్లలోని డీలక్స్ బస్సుల్లో ప్రయాణించిన మహిళల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. మహిళా ప్రయాణికుల్లో విజేతలను ఈ నెల 18న లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేశారు. వీరికి ఖమ్మం కొత్త బస్టాండ్‌లో శనివారం బహుమతులు అందజేయగా ఎంవీఐ ఎస్.శ్రీనివాస్ ముఖ్య అతిథిగా మాట్లాడారు. సుశిక్షితులైన డ్రైవర్లు ఉన్న నేపథ్యాన ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం క్షేమమని తెలిపారు. ఆర్టీసీ ఆర్‌ఎం సరిరామ్ మాట్లాడుతూ.. మహాలక్ష్మి పథకం నేపథ్యాన రద్దీ రూట్లలో మహిళల కోసం డీలక్స్ బస్సులను ప్రవేశపెట్టి లక్కీ డ్రా ఏర్పాటు చేశామని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్లు ఎస్.భవానీప్రసాద్, జీఎస్.పవిత్ర, డిపో మేనేజర్ దినేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రీజియన్‌లో కార్గో సేవల విస్తరణ

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం రీజియన్‌లో ఆర్టీసీ కార్గో సేవలను విస్తరించేలా ఏజెంట్ల సంఖ్య పెంచామని ఖమ్మం, వరంగల్ జిల్లాల లాజిస్టిక్స్ అధికారి టి.పవన్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రీజియన్‌లో కొత్తగా కారేపల్లి, గుండాల, అశ్వాపురంలలో పాయింట్లు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. అంతేకాక ఏపీలోని శ్రీకాకుళంలో కూడా పాయింట్ ప్రారంభించినట్లు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో అన్ని ప్రాంతాలకు కార్గో సేవలు అందిస్తున్నట్లు వెల్లడించిన ఆయన.. తక్కువ ఖర్చుతో వేగంగా, భద్రంగా వినియోగదారుల వస్తువులను గమ్యస్థానాలకు చేర్చనున్నట్లు వివరించారు.

ఫుడ్ సేఫ్టీ అధికారి తనిఖీలు

సత్తుపల్లి: సత్తుపల్లిలోని పలు రెస్టారెంట్లతో పాటు బాలుర హాస్టల్‌లో శనివారం జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి కిరణ్‌కుమార్ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన సత్తుపల్లి ఎస్టీ బాలుర హాస్టల్‌లోనే కాక పలు రెస్టారెంట్లలో ఆహార నాణ్యతను పరిశీలించారు. ఆరోగ్యానికి హాని చేసే రసాయనాలు వాడొద్దని, హోటళ్ల ఆవరణతో పాటు కిచెన్లలో పరిశుభ్రత పాటించాలని నిర్వాహకులకు సూచించారు. పలు హోటళ్లలో ఆహార పదార్థాల శాంపిళ్లను సేకరించి ల్యాబ్‌కు పంపిస్తున్నట్లు ఆయన తెలిపారు.

డీఏఓకు రైతుల సన్మానం



విజయనిర్మలను సన్మానిస్తున్న రైతులు

కల్లూరు: రుణమాఫీ నేపథ్యాన ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెబుతూ రైతులు పలువురు జిల్లా వ్యవసాయ అధికారి విజయనిర్మలను సన్మానించారు. రుణమాఫీ వివరాలు, రైతుల అభిప్రాయాలు తెలుసుకునేందుకు డీఏఓ శనివారం కల్లూరు పర్యటించారు. ఈ సందర్భంగా ఏఓ ఎం.రూప, ఏఈఓ దీపికతో కలిసి రైతులతో మాట్లాడి రుమాఫీ వివరాలు ఆరా తీయడమేకాక పంటల సాగులో యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. అనంతరం డీఏఓను రైతులు సన్మానించగా కాంగ్రెస్ నాయకులు పసుమర్తి చందర్‌రావు, ఎస్కే యాకూబ్‌అలీ, బొడ్డు కృష్ణ, కుంచాల గురవయ్య, బొడ్డు పిచ్చయ్య, రైతులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్లు తీసుకెళ్లండి

ఖమ్మంసహకారనగర్: జిల్లాలోని వృత్తి విద్యా కోర్సులైన డ్రాయింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ పరీక్షల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు సర్టిఫికెట్లు సిద్ధమయ్యాయని డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు. ఆయా అభ్యర్థులు హాల్‌టికెట్, ఆధార్ కార్డుల జిరాక్స్‌తో తమ కార్యాలయంలో సంప్రదించి సర్టిఫికెట్ తీసుకెళ్లాలని సూచించారు.

ఇళ్లు కట్టిస్తానని మోసం చేసిన వ్యక్తి రిమాండ్

పెనుబల్లి: ఇల్లు లేని నిరుపేదలకు ట్రస్టు ద్వారా ఇళ్లు నిర్మిస్తామని మాయమాటలు చెప్పి డబ్బు వసూలు చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి శనివారం రిమాండ్‌కు తరలించినట్లు వీఎం బంజర్ ఎస్‌ఐ కె.వెంకటేశ్ తెలిపారు. పెనుబల్లి మండలం పాత కుప్పెనకుంట్లలోని పేదలకు న్యాయ నిపుణుడు పీసీ రావు జ్ఞాపకార్థం స్వచ్ఛంద సంస్థ ద్వారా ఇళ్లు కట్టిస్తామని ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా వీర్లపాడుకు చెందిన అద్దంకి జనార్దన్‌రావు నమ్మబలికాడు. తాను మచిలీపట్నంలో ఎంపీడీఓగా పనిచేస్తున్నానని గ్రామస్తులతో పాటు సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయికి చెప్పగా ఆమె ఈ నెల 8న శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత గ్రామానికి చెందిన నారపోగు శ్రీనివాసరావు, బొల్లిపోగు రవికుమార్, కంటిపూడి ఏసుబాబు, నారపోగు నాగరాజుతోపాటు పలువురి నుంచి రూ.4 వేలు చొప్పున వసూలు చేయడంతో విచారణ చేపట్టాలని ఎమ్మెల్యే పోలీసులకు సూచించారు. ఈ మేరకు ఆయన ఉద్యోగాలు, ఇళ్ల నిర్మాణం, స్కాలర్‌షిప్‌ల పేరిట 1992 నుంచి మోసం చేస్తున్నట్లు తేలింది. ఎన్టీఆర్ జిల్లా తిరువూరు, నందిగామ, ఖమ్మం రూరల్ పోలీస్‌స్టేషన్లలో జనార్దన్‌రావుపై ఏడు కేసులు ఉన్నట్లు గుర్తించగా అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.





రామాలయ నిర్మాణ విశేషాలను వివరించే చిత్రాలు, తానీషాతో రామదాసు



ఆడిటోరియం ఆవరణలో వేదిక

ముస్తాబైన ఆడిటోరియం !

- ఆరేళ్ల పాటు కొనసాగిన పనులు
- ఎట్టకేలకు నేలకొండపల్లిలో సిద్ధమైన రామదాసు ఆడిటోరియం
- ఆకట్టుకునేలా రామాయణ ఘట్టాల చిత్రీకరణ



నేలకొండపల్లిలో నిర్మించిన భక్త రామదాసు ఆడిటోరియం

నేలకొండపల్లి: పరమభక్త గ్రేసరుడు కంచర్ల గోపన్న (భక్త రామదాసు) జన్మస్థలంలోని ధ్యాన మందిరం వద్ద ఆడిటోరియం నిర్మాణ పనులు ఎట్టకేలకు తుది దశకు చేరాయి. ఆరేళ్లుగా కొనసాగుతున్న పనులు చివరి దశకు చేరడంతో ప్రారంభానికి ముస్తాబు చేస్తున్నారు. నేలకొండపల్లి మండల కేంద్రంలోని భక్తరామదాసు ధ్యాన మందిరంలో భక్తుల సౌకర్యార్థమే కాక ఉత్సవాల నిర్వహణకు అవసరమైన ఆడిటోరియం నిర్మించాలని నిర్ణయించారు. ఇందుకోసం రూ.3.50 కోట్ల నిధులు మంజూరు చేయగా 2018 జనవరి 21న అప్పటి ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. అయితే, రకరకాల కారణాలతో పనులు నత్తనడక సాగగా, గత కలెక్టర్ వీపీ గౌతమ్ ప్రత్యేక శ్రద్ధ వహించారు. కాంట్రాక్టర్‌ను మారుస్తామని హెచ్చరించగా.. ఇటీవల రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సైతం పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. దీంతో అధికారుల పర్యవేక్షణలో ఆగమేఘాలపై పనులు పూర్తిచేసి ప్రారంభానికి సిద్ధం చేశారు.

ఆకట్టుకుంటున్న చిత్రాలు

రామదాసు జన్మస్థలంలో జయంతి, ఆరాధన ఉత్సవాలు, కల్యాణం, కచేరీలు, ఇతరత్రా ఉత్సవాలు నిర్వహించేందుకు అవసరమైన స్థలం లేక ఇక్కట్లు ఎదురయ్యేవి. ఈ నేపథ్యాన భక్తుల వినతితో భద్రాచలం దేవస్థానానికి అనుబంధంగా ఉన్న రామదాసు ధ్యాన మందిరంలో ఆడిటోరియం నిర్మాణానికి నిధులు కేటాయించారు. ఈ మేరకు దాదాపు 500 మంది కూర్చునే సామర్థ్యం కలిగిన ఆడిటోరియం నిర్మించారు. అంతేకాక గోడలపై రామయాణ ఇతివృత్తం, భద్రాచలంలో రామాలయ నిర్మాణం, రామదాసు చెరసాలలో ఉన్నప్పటి చరిత్రను వివరించేలా చిత్రాలు వేయించారు. ఆడిటోరియంలో గోడలకు ఇరువైపులా వేయించిన రంగు రంగుల చిత్రాలు ఆకట్టుకుంటున్నాయి.

మిత్రుడికి మంత్రి కన్నీటి వీడ్కోలు

అనారోగ్యంతో కన్నుమూసిన సీనియర్ నేత జక్కంపూడి



జక్కంపూడి కృష్ణమూర్తి (ఫైల్)



కృష్ణమూర్తి మృతదేహం వద్ద కంటతడి పెడుతున్న మంత్రి తుమ్మల

తల్లాడ: విగతజీవిగా ఉన్న ఆప్తమిత్రుడిని చూసి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కన్నీరు మున్నీరయ్యారు. తల్లాడ మండలం బిల్లుపాడుకు చెందిన తుమ్మల ముఖ్య అనుచరుడు, 30 ఏళ్ల రాజకీయ జీవితంలో ఆయన వెన్నంటి నిలిచిన జక్కంపూడి కృష్ణమూర్తి (70) అనారోగ్యంతో బాధపడుతూ శనివారం ఉదయం మృతి చెందారు. ఈ విషయం తెలియగానే అసెంబ్లీలో ఉన్న మంత్రి తన మిత్రుడిని కడసారి చూసేందుకు వచ్చారు. ఈ నేపథ్యాన జక్కంపూడి మృతదేహాన్ని చూడగానే మంత్రి కన్నీరు ఆగలేదు. ఆపై అంత్యక్రియల్లో ముందు భాగాన నిలిచారు. కాగా, బిల్లుపాడు మాజీ సర్పంచ్, తల్లాడ సొసైటీ మాజీ అధ్యక్షుడైన కృష్ణమూర్తికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆయన 1982లో బిల్లుపాడు, 1991లో జక్కంపూడి సర్పంచ్‌గా ఎన్నిక కాగా, 1995 నుంచి 2001 వరకు సొసైటీ అధ్యక్షుడిగా పనిచేశారు. టీడీపీ, బీఆర్‌ఎస్‌లో తుమ్మల ప్రధాన అనుచరుడిగా కొనసాగుతూ ప్రస్తుతం కాంగ్రెస్‌లో ఉన్నారు. కాగా, జక్కంపూడి అంతిమయాత్రకు మండల వ్యాప్తంగా వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, స్థానికులు హాజరుకాగా, కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్ జక్కంపూడి పాడె మోశారు. అలాగే, రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యేలు కొండబాల కోటేశ్వరరావు, సండ్ర వెంకటవీరయ్య, తాటి వెంకటేశ్వర్లు, మెచ్చా నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు వాసిరెడ్డి రామనాథం, పోతినేని సుదర్శన్‌రావు, నున్నా నాగేశ్వరరావు, ఎస్.తిరుమల్‌రావు, ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు తదితరులు కూడా జక్కంపూడి అంత్యక్రియల్లో పాల్గొని నివాళులర్పించారు.

పరస్పర సహకారంతో సమాజాభివృద్ధి

భద్రాద్రి బ్యాంక్ మహాజన సభలో ఏపీ హైకోర్టు జడ్జి కృపాసాగర్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఏపీ హైకోర్టు జడ్జి కృపాసాగర్, పక్కన బ్యాంక్ చైర్మన్ కృష్ణమూర్తి

ఖమ్మంగాంధీచౌక్: పరస్పర సహకారంతో సమాజం త్వరగా అభివృద్ధి చెందుతుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు జడ్జి డాక్టర్ కృపాసాగర్ తెలిపారు. ఖమ్మంలో శనివారం భద్రాద్రి కోఆపరేటివ్ బ్యాంక్ 27వ వార్షిక మహాజన సభ నిర్వహించారు. బ్యాంకు చైర్మన్ చెరుకూరి కృష్ణమూర్తి అధ్యక్షతన బ్యాంక్ 27వ వార్షిక మహాజన సభ జరిగింది. ఈ సభలో ముఖ్య అతిథిగా హాజరైన కృపాసాగర్ మాట్లాడుతూ.. ఒకరికొకరు సహకరించుకోవడం ఆదిమ యుగాల నుంచే ఉందని.. ఈ విధానమే పరిణతి చెందుతూ వస్తోందని తెలిపారు. అందరి సహకారంతో భద్రాద్రి బ్యాంక్ 27 ఏళ్లుగా ప్రగతిపథంలో ముందుకు సాగుతుండటం అభినందనీయమని చెప్పారు. బ్యాంక్ చైర్మన్ కృష్ణమూర్తి మాట్లాడుతూ.. 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.604.52 కోట్ల డిపాజిట్లు ఉండగా, 2022–23 నాటికి రూ.298.96 కోట్ల మేర రుణాలు ఇచ్చామని తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరాంతానికి రూ.346.25 కోట్ల వృద్ధి సాధించామని వివరించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్ మాట్లాడుతూ.. భద్రాద్రి బ్యాంక్ ప్రజల ఆర్థికావసరాలు తీర్చడంలో ముందంజలో ఉండటం అభినందనీయమన్నారు. అనంతరం ఇన్‌చార్జ్ డీసీఓ సయ్యద్ ఖుర్షీద్ మాట్లాడారు. బ్యాంక్ వైస్ చైర్మన్ వేములపల్లి వెంకటేశ్వరరావుతో పాటు సన్నె ఉదయ్‌ప్రతాప్, రేఖల భాస్కర్, దేవత రాజారావు, మద్ది పిచ్చయ్య, బులుసు సాంబమూర్తి, కర్లపూడి నర్మద, కపిలవాయి జయప్రద, పనస శిల్ప, దాసరి వేణుగోపాల్, సత్యనారాయణ, నర్సింహారావు, శ్యాంసుందర్ రావు, రామారావు, గణేశ్‌బాబు తదితరులు పాలన్నారు.

31 నుంచి వైరా రిజర్వాయర్‌లో చేపల వేట

వైరా: వైరా రిజర్వాయర్‌లో చేపల వేటకు మత్స్యశాఖ అధికారులు అనుమతి జారీ చేశారు. ఐదు నెలలుగా రిజర్వాయర్ పరిధిలోని నాలుగు మండలాల్లోని మత్స్యకారులు చేపల వేట కోసం ఎదురు చూస్తున్నారు. ఇన్నాళ్లు పూర్తిస్థాయిలో నీరు లేక మత్స్య సహకార సొసైటీ సభ్యులు చేసిన తీర్మానం మేరకు చేపలు వేటాడొద్దని సూచించారు. ప్రస్తుత వర్షాలతో రిజర్వాయర్‌లోకి 12 అడుగుల మేర నీరు చేరడంతో ఈ నెల 31వ తేదీ నుంచి చేపలు పట్టేందుకు సొసైటీ సభ్యులు నిర్ణయించగా అధికారులు అనుమతించారు. కాగా, రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 18.3 అడుగులకు చేరితే ఆయకట్టు పరిధిలో రైతులకు ఇబ్బంది ఉండదని చెబుతున్నారు. ప్రస్తుతం ఉన్న నీటికి మరో అడుగు మేర పెరిగితే నార్లు పోసుకునేందుకు రైతులు సిద్ధమవుతున్నారు.

'నాసా' సదస్సులో విన్‌ఫీల్డ్ డైరెక్టర్



సదస్సులో పాల్గొన్న పుల్లారావు

ఖమ్మంసహకారనగర్: నాసా (నేషనల్ ఏరోనాటిక్స్ అండ్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్) ఆధ్వర్యాన జరిగిన సదస్సులో ఖమ్మంలోని విన్‌ఫీల్డ్ డైరెక్టర్ గద్దె పుల్లారావు పాల్గొన్నారు. అమెరికాలోని న్యూయార్క్ రాష్ట్రంలో ఇటీవల జరిగిన ది గ్లోబ్ ప్రోగ్రాం 29వ వార్షిక సదస్సులో పాల్గొనే అవకాశం దక్కిందని పాఠశాల డైరెక్టర్లు మన్నె కిశోర్‌కుమార్, పోలవరపు శ్రీకాంత్ తెలిపారు. సదస్సుకు హాజరైన పుల్లారావు మాట్లాడుతూ.. మొత్తం 54 దేశాల నుంచి 183 మంది శాస్త్రవేత్తలు, ట్రైనర్లు, 130 మంది విద్యార్థులు పాల్గొన్న ఈ సదస్సులో దేశం నుంచి తమకు మాత్రమే అవకాశం దక్కిందని వెల్లడించారు. ఈ మేరకు హైడ్రాలజీ ప్రొటోకాల్ గ్రూప్ డిస్కషన్స్‌లో తాను పాల్గొన్నట్లు ఆయన తెలిపారు.

సీపీఆర్‌తో పునర్జన్మ

డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాలతి



సీపీఆర్ ఎలా చేయాలో వివరిస్తున్న డీఎంహెచ్‌ఓ

ఖమ్మంవైద్యవిభాగం: సీపీఆర్ అనేది ఆపదలో ఉన్న వారికి పునర్జన్మ వంటిదని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.మాలతి తెలిపారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా ఖమ్మంలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో శనివారం సీపీఆర్‌పై ఉద్యోగులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. ప్రతీ మనిషి జీవన శైలిలో మార్పులు తెచ్చుకుని ఆరోగ్యవంతమైన జీవనం గడపాలన్నారు. కాగా, ప్రతీ ఉద్యోగి సీపీఆర్ ఎలా చేయాలో తెలుసుకుంటే ఆపదలో ఉన్న వారిని ఆదుకోవచ్చని తెలిపారు. డీటీసీఓ డాక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ.. ప్రతీ వంద మందిలో పది మందికి గుండె సంబంధింత సమస్యలు వస్తాయని, సీపీఆర్ ద్వారా ఇలాంటి వారికి ప్రాథమిక చికిత్స అందుతుందని చెప్పారు. అనంతరం డాక్టర్ బాలకృష్ణ అవగాహన కల్పించగా అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శిరీష, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సైదులు, ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ రామారావు, భాస్కర్, రమణ, మోతియా, డెమో కాశీనాథ్ పాల్గొన్నారు.

గురుకులాల్లో ఖాళీ సీట్ల భర్తీకి కౌన్సెలింగ్

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం రీజియన్‌లోని ఎస్సీ గురుకుల బాలుర జూనియర్ కళాశాలల్లో ఖాళీ సీట్ల భర్తీకి శనివారం స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించారు. అన్ని గురుకులాల్లో కలిపి 174 సీట్లు ఖాళీ ఉండగా, 117 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ నేపథ్యాన ఖమ్మం సమీపాన కొనసాగుతున్న తిరుమలాయపాలెం గురుకుల బాలుర కళాశాలలో కౌన్సెలింగ్ నిర్వహించగా 103 మంది విద్యార్థులను ఎంపీసీ, బైపీసీ గ్రూపులకు ఎంపిక చేశారు. జోనల్ ఆఫీసర్ ప్రత్యూష, కౌన్సెలింగ్ కన్వీనర్ కె.వెంకటేశ్వర్లు, కోకన్వీనర్ పి.సత్యప్రసాద్‌రాజు, తిరుమలాయపాలెం గురుకులం వైస్ ప్రిన్సిపాల్ బోస్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు సేవ చేసేందుకు ఏబీఏపీ విస్తరణ

రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో జాతీయ అధ్యక్షుడు అయ్యప్పదాస్



పుల్లం రాజు



సమాశంలో పాల్గన్న జాతీయ, రాష్ట్ర కార్యవర్గ బాధ్యులు, మేయర్ నీరజ

ఖమ్మంఅర్బన్: భక్తులకు మెరుగైన సేవలందించేందుకు ఏబీఏపీ (అఖిల భారతీయ అయ్యప్ప ధర్మప్రచార సభ)ను విస్తరిస్తున్నట్లు జాతీయ అధ్యక్షుడు అయ్యప్పదాస్ వెల్లడించారు. ఖమ్మంలో శనివారం జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. అయ్యప్ప స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు నాలుగు చోట్ల అన్నదానం కొనసాగిస్తున్నట్లు తెలిపారు. అలాగే, ఎరిమేలి నుంచి పంబ వెళ్లే దారిలో శివం సమీపాన అన్నదాన మందిరం నిర్మించినట్లు చెప్పారు. అనంతరం మేయర్ పి.నీరజ తదితరులు మాట్లాడారు.

రాష్ట్ర అధ్యక్షుడిగా పుల్లం రాజు

ఏబీఏపీ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా ఖమ్మంకు చెందిన పుల్లం రాజు ఎన్నికయ్యారు. అలాగే, కార్యదర్శిగా కర్క సిద్ధు, కోశాధికారిగా మండా శ్రీనివాస్‌తో పాటు 21మందితో కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు తెలిపారు. సమావేశంలో సి.మనోహర్‌తోపాటు తెలంగాణ, ఏపీ, తమిళనాడు కార్యవర్గ బాధ్యులు పాల్గొన్నారు.

పాపటపల్లి ఆలయంలో చోరీ

రఘునాథపాలెం: మండలంలోని పాపటపల్లి శ్రీలక్ష్మీ తిరుపతమ్మ దేవాలయంలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. రోజులాగే శుక్రవారం సాయంత్రం ఆలయానికి అర్చకులు తాళం వేసి వెళ్లారు. శనివారం ఉదయం వచ్చేసరికి తాళం పగలుగొట్టి ఉండగా హుండీ కానరాలేదు. స్థానికులు చుట్టుపక్కల వెతకగా కాస్త దూరంలో హుండీ తాళం పగలగొట్టి పడేసి ఉంది. దీంతో భక్తులు సమర్పించిన కానుకలు రూ.40 వేల మేర చోరీ చేసి హుండీ వదిలేసి ఉంటారని భావిస్తున్నారు. ఘటనపై గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదుతో రఘునాథపాలెం ఎస్‌ఐ మౌలానా ఆధ్వర్యాన సిబ్బంది చేరుకుని విచారణ చేపట్టారు.

హైదరాబాద్ వెళ్లొచ్చే సరికి...

ఖమ్మంక్రైం: ఖమ్మం బైపాస్ రోడ్డు ప్రాంతంలో నివాసముంటున్న ఓ జర్నలిస్ట్ ఇంట్లో చోరీ జరిగింది. వరంగల్ జిల్లాలో జర్నలిస్టుగా విధులు నిర్వర్తిస్తున్న ఎస్.ఎస్.రావు తన భార్యతో కలిసి ఇక్కడ ఉంటున్నాడు. ఆయన కుమారుడు విదేశాల్లో ఉండగా.. ఇటీవల ఎస్.ఎస్.రావు దంపతులు హైదరాబాద్‌కు వెళ్లారు. శనివారం తిరిగి వచ్చేలోగా తాళం పగులకొట్టి ఉండటంతో లోపల పరిశీలించగా రూ.6 లక్షల నగదు, 24 తులాల బంగారం చోరీకి గురి అయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏసీపీ రమణమూర్తి, ఖమ్మం టూటౌన్ సీఐ బాలకృష్ణతో పాటు సీసీఎస్ పోలీసులు పరిశీలించి దర్యాప్తు ప్రారంభించారు.

పేకాటస్థావరంపై దాడి

చింతకాని: మండలంలోని బస్వాపురం శివారు మామిడి తోటలో పలువురు పేకాట ఆడుతున్నారనే సమాచారంతో పోలీసులు శనివారం తనిఖీలు చేపట్టారు. పేకాట ఆడుతున్న ఐదుగురిలో ఇద్దరు పట్టుబడగా, ముగ్గురు పారిపోయారు. వీరి నుంచి రూ.9 వేల నగదు, ఒక బైక్, ఫోన్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగుల్‌మీరా తెలిపారు.

ఈఎంఐ చెల్లించమన్నందుకు దాడి

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలో నివాసముంటున్న ఓ కానిస్టేబుల్ తన ఇంటి నిర్మాణానికి తీసుకున్న అప్పుపై ఈఎంఐ చెల్లించాలని కోరిన బ్యాంక్ సిబ్బందిపై దాడి చేసినట్లు తెలిసింది. సదరు కానిస్టేబుల్ ఒక ప్రైవేట్ బ్యాంకులో రుణం తీసుకోగా, కొద్దినెలలుగా ఈఎంఐ చెల్లించడం లేదని సమాచారం. దీంతో వారం రోజులుగా సిబ్బంది ఫోన్ చేస్తుండటంతో శనివారం మమతా రోడ్డు సమీపానికి రావాలని సూచించిన కానిస్టేబుల్ వారిపై దాడి చేసినట్లు తెలిసింది. ఈ విషయమై సిబ్బంది ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా, తమకు ఫిర్యాదు అందలేదని ఖమ్మం అర్బన్ పోలీసులు తెలిపారు.

పోగొట్టుకున్న బ్యాగ్ అప్పగింత

డయల్ 100కు ఫోన్ చేయడంతో స్పందన



విద్యార్థినికి బ్యాగ్ అందజేస్తున్న కానిస్టేబుళ్లు

ఖమ్మంక్రైం: స్టడీ సర్టిఫికెట్లు, ఇతర పత్రాలు కలిగిన బ్యాగ్‌ను చేజార్చుకున్న విద్యార్థిని డయల్ 100కు ఫోన్ చేయడంతో పోలీసు సిబ్బంది స్పందించి గంటల వ్యవధిలో బ్యాగ్ అప్పగించారు. ఖమ్మంలో నర్సింగ్ చదువుతున్న ఓ విద్యార్థి శనివారం పాత బస్టాండ్ సమీపానికి చేరుకోగా బ్యాగ్ చేజారింది. అందులో విద్యార్హతల సర్టిఫికెట్లు ఉండడంతో ఆందోళనకు గురైన ఆమె ఉదయం 6.45 గంటలకు డయల్ 100కు ఫోన్ చేసింది. ఈ మేరకు ఖమ్మం వన్‌టౌన్ బ్లూకోల్ట్స్ కానిస్టేబుళ్లు డి.రవికుమార్, ఆర్.శ్రీధర్ పాత బస్టాండ్‌లోని సీసీటీవీ పుటేజీని పరిశీలించగా బ్యాగ్ ఎక్కడ పడిపోయిందో గుర్తించి 8.15 గంటల కల్లా ఆమెకు అప్పగించడంతో కృతజ్ఞతలు తెలిపింది.